# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-08-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **చేనేత వస్త్రాలపై వస్తు సేవల పన్ను-జీఎస్టీని ప్రభుత్వమే కేంద్రానికి చెల్లించనుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**
2. **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి వర్గం ఈరోజు సమావేశం కానుంది.**
3. **తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో నిర్వహించే మహాధర్నా కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈ రోజు పాల్గొంటారు.**
4. **కృష్ణా డెల్టాలో సాగు నీటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**
5. **తల్లి పాలపై అవగాహన పెంచేందుకు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.**

=========================

చేనేత వస్త్రాలపై వస్తు సేవల పన్ను-జీఎస్టీని ప్రభుత్వమే కేంద్రానికి చెల్లిస్తుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో చేనేత శాఖపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి గత సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేనేత వస్త్రాలపై జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వమే కేంద్రానికి చెల్లించనుందని తెలిపారు. తద్వారా చేనేత రంగం బలోపేతమవడంతో పాటు... తక్కువ ధరల్లో చేనేత వస్త్రాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. మగ్గాలకు 200, పవర్ లూమ్స్ కు 500 యూనిట్ల విద్యుత్ ను ఉచితంగా అందివ్వాలని నిర్ణయించామన్నారు. జాతీయ చేనేత దినోత్సవం నుంచి ఈ నిర్ణయాలను అమలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు రాష్ట్ర మంత్రి వర్గం సమావేశం కానుంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై చర్చించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే పలు సంస్థలకు భూ కేటాయింపులపై కూడా మంత్రి వర్గం చర్చించనుందని తెలిపారు.

-------------------------

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చేయాలని కోరుతూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈ రోజు పాల్గొంటారు. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు పాల్గొనున్నారు. ఈ మహాధర్నాను ఉదయం 10 గంటల 30 నిమిషాలకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ప్రారంభిస్తారని,. సాయంత్రం ముగింపు కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ పాల్గొంటారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రిజిస్ట్రేషన్ సేవలు వేగవంతంగా, పారదర్శకంగా అందించేలా సంస్కరణలు తెచ్చామని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. గుంటూరులోని కొరిటెపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నిన్న సందర్శించిన మంత్రి అక్కడ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికత సహకారంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను గంటలోపే పూర్తి చేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా రిజిస్ట్రేషన్ పూర్తి చేసి పత్రాలను అందించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..27 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతోందని ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. “జులైలో రాష్ట్రం 3 వేల 803 కోట్ల రూపాయల రాష్ట్ర వస్తు, సేవల పన్ను- ఎస్ జీఎస్టీ వసూళ్లు సాధించిందని ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. 2017లో జీఎస్టీ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఇదే అత్యధికమని, వార్షిక వృద్ధి రేటు 14 శాతంగా ఉందని చెప్పారు. ఇది దక్షిణాది రాష్ట్రాల్లోనే అత్యధిక జీఎస్టీ వృద్ధి రేటు అని, దేశంలోని పెద్ద రాష్ట్రాల్లో జీఎస్టీ వృద్ధిలో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో నిలిచిందని మంత్రి లోకేశ్ వెల్లడించారు.

---------------------------

కృష్ణా డెల్టాలో సాగు నీటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కృష్ణా జిల్లా పెడన, గుడివాడ నియోజకవర్గాల్లో మంత్రి గత సాయంత్రం పర్యటించి గుడ్లవల్లేరు లాకులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నీటి నిర్వహణ వ్యవస్థ ద్వారా పంట సాగుకు సరిపడేలా నీటి నిల్వలు చేయాలని అధికారులను ఆదేశించారు. కృష్ణా డెల్టా తూర్పు కాలువ కింద ఉన్న గుడివాడ, పెడన కైకలూరు నియోజకవర్గాలలో చివరి ఆయకట్టుకు నీరు అందిస్తామని మంత్రి తెలుపుతూ

వాయిస్ ..33 సెకన్లు

---------------------------

తల్లి పాలపై అవగాహన పెంచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. గుంటూరులో నిర్వహించిన ప్రపంచ తల్లిపాల

వారోత్సవాల రాష్ట్రస్థాయి కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా తల్లిపాల వారోత్సవాల గోడపత్రికను ఆవిష్కరించారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి రాష్ట్రంలోని అంగన్ వాడీ కేంద్రాల ద్వారా తెలియజేస్తున్నామని చెప్పారు. మంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ...

వాయిస్ ..33 సెకన్లు

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో పునరుత్పాదక ఇంధన నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు.. దేశ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్‌ను శక్తివంతం చేయడంతో పాటు సౌర, పవన శక్తికి నైపుణ్య కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ఇతివృత్తంతో ఏపీ నైపున్యాభి వృద్ధి సంస్థ, స్వనీతి ఇనీషియేటివ్ సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో సమావేశాన్ని నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి 250కి పైగా పరిశ్రమల ప్రతినిధులు, ముఖ్యమైన అభివృద్ధి భాగస్వాములు హాజరుకానున్నారు. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది యువతకు సౌర, పవన శక్తి రంగాల్లో తయారీ నుంచి నిర్వహణ వరకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నామని అధికారులు తెలిపారు.

-----------------------------

తెలంగాణలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపులు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క కోరారు. ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో మంత్రి నిన్న సమావేశమై ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రానికి 2025-26లో కేవలం 6 కోట్ల పనిదినాలనే మంజూరు చేశారని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎటువంటి ఆంక్షలు లేకుండా 12 కోట్ల పనిదినాలను కేటాయించి నిధులను పెంచాలని మంత్రి కోరారు.

-----------------------------

ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ....

వాయిస్...33 సెకన్లు

మరోవైపు తెలంగాణలో రానున్న ఐదు రోజులపాటు పలు జిల్లాల్లో ఉరుములు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

======================